



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
09-05-2025
పేజీలు: 02


## ఐపీఎల్ లీగ్‌వాయిదా

భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ లీగ్ ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన బీసీసీఐ. IPL 2025 లో మిగిలిన ఇంకా 12 మ్యాచ్ లను ఇండియా Vs ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ తర్వాత ఆడొచ్చని సమాచారం.



# పాక్ సిటీలపై భారత్ డ్రోన్లతో ఎటాక్

భారత్, పాకిస్థాన్ మధ్య విస్తరిస్తున్న ఘర్షణల నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున, రాత్రి సైనిక స్థావరాలు, పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాక్ చేపట్టిన క్షిపణులు, డ్రోన్ దాడులను భారత సాయుధ దళాలు తిప్పికొట్టాయి. అనంతరం పాకిస్థాన్‌లోని అనేక గగనతల రక్షణ వ్యవస్థలు, ఇతర లక్ష్యాలపై భారత్ భారీ ప్రతీకార దాడులు చేసింది. 'ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయిలో కొనసాగుతోంది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌కు ఎలాంటి తప్పించుకునే అవకాశం ఇవ్వబోం' అని ఓ సీనియర్ అధికారి టైమ్స్ ఆఫ్ ఇండియాకు తెలిపారు. రాత్రిపూట కూడా భారత దాడులు కొనసాగుతుండగా... ఉత్తర అరేబియా సముద్రంలో యుద్ధ నౌకల మోహరింపు, , నియంత్రణ రేఖ (LoC) వద్ద కాల్పుల విరమణ ఉల్లంఘనలు కొనసాగుతున్నాయి. ఇంతలోనే పాకిస్థాన్‌కు చెందిన JF-17 యుద్ధ విమానాలు, ఒక F-16 యుద్ధ విమానం కూల్చివేసినట్టు, అలాగే భారత్ ఇస్లామాబాద్‌ను లక్ష్యంగా చేసిందన్న అనధికార నివేదికలు వచ్చాయి. భారత వైమానిక దళం (IAF) పాక్ క్షిపణుల దాడులకు తక్షణమే ప్రతిస్పందనగా ఇజ్రాయేల్ నుంచి కొనుగోలు చేసిన హారప్, హార్పీ కామికాజీ డ్రోన్లను వినియోగించింది. ఇవి శత్రు లక్ష్యాలు, రాడార్‌లపై దాడిచేసి క్రూయిజ్ మిసైల్‌లుగా పని చేస్తాయి. పాకిస్థాన్ పాక్షికంగా తిరిగి రాత్రి పూట దాడులు ప్రారంభించింది. జైసల్మేర్, అమృతసర్, జమ్మూ, పఠాన్‌కోట్, ఉదంపూర్ వైమానిక స్థావరాలు, అలాగే సాంబా, అర్ణియా ప్రాంతాలే లక్ష్యంగా మిసైల్‌లు, డ్రోన్లు ప్రయోగించింది. జమ్మూ నగరంలో పేలుళ్ల శబ్దాలతో ఆందోళన చెలరేగింది. అయితే, భారత దళాలు దీనిని



తిప్పికొట్టాయి. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని ఒక అధికారి తెలిపారు. రాజస్థాన్‌లోని జసల్మేర్‌లో పాక్ పైలట్ పట్టుబడిన విషయం తెలిసిందే.

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| గుజరాత్ | 11 | 8 | 3 | 16 |
| ఆర్సీబీ | 11 | 8 | 3 | 16 |
| పంజాబ్ | 11 | 7 | 3 | 15 |
| ముంబై | 12 | 7 | 4 | 14 |
| ఢిల్లీ | 11 | 6 | 4 | 13 |
| కొల్‌కత్తా | 11 | 5 | 5 | 11 |
| లక్నో | 11 | 5 | 6 | 10 |
| సన్‌రైజర్స్ | 11 | 3 | 7 | 7 |
| రాజస్తాన్ | 12 | 3 | 9 | 6 |
| చెన్నై | 12 | 3 | 9 | 6 |

ఆరెంజ్ క్యాప్ 510 ఐపీఎల్ అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్ 20 ఐపీఎల్ అత్యధిక వికెట్స్



## రాశీసింగ్ లోని మరో కోణం

ఈషా రెబ్బా, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. దీనికి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. దాంతో ఇప్పుడు సీజన్ 2కు రంగం సిద్ధమైంది. డైరెక్టర్ మారుతీ షో రన్నర్ గా వ్యవహరిస్తున్న ఈ వెబ్ సీరిస్ కు రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా, కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. 'త్రీ రోజెస్' తాజా సీజన్ లో నటిస్తున్న హీరోయిన్లు ఈషా రెబ్బా, కుషిత కల్లపు గ్లింప్స్ ఇప్పటికే విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తాజాగా మరో రోజా... రాశీసింగ్ గ్లింప్స్ ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ లో రాశీ సింగ్ క్యారెక్టర్ ను ట్రెడిషనల్ గా పరిచయం చేస్తూ, మోడరన్ గా టర్న్ అయిన ట్విస్ట్ చూపించారు. ఆమె ఎందుకు ట్రెడిషనల్ నుంచి మోడరన్ గా మారింది అనేది గ్లింప్స్ లో ఆసక్తి కలిగిస్తోంది. త్వరలోనే ఈ వెబ్ సిరీస్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

# హైడ్రా అంటే కబ్జాదారుల వెన్నులో వణుకు పుట్టాలి

హైడ్రా పేరు చెప్పగానే కబ్జాదారులకు వెన్నులో వణుకు పుట్టాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారు అన్నారు. చెరువులు, నాలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు అనే తేడా లేకుండా.. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసేద్దామనే ఆలోచన చేసిన వారికి హైడ్రా ఉందనే భయం ఉండాలని పేర్కొన్నారు. కబ్జా చేసిన వారు ధనికులు, ఆక్రమణదారుల పట్ల కఠినంగా వ్యవహరించి.. పేదల పట్ల సానుభూతితో పని చేయాలని హైడ్రాకు ముఖ్యమంత్రి సూచించారు. గురువారం హైడ్రా పోలీసు స్టేషన్ ను ప్రారంభించారు. అలాగే హైడ్రా వెబ్ సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. హైడ్రాకు అందుబాటులోకి వచ్చిన డీఆర్ ఎఫ్ ట్రక్కులు 21, స్కార్పియోలు 55, ద్విచక్ర వాహనాలు 37 , ఇన్నోవాలు 4, మినీ బస్సలు, ట్రూప్ కేరియర్స్ ఐదింటిని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. పేదల అక్రమణలు తొలగించాల్సి వస్తే వారికి ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు ప్రణాళికలు తయారు చేయాలని హైడ్రా అధికారులకు సూచించారు. అక్రమ నిర్మాణాలను కూలగొడితే రియల్ ఎస్టేట్ పడిపోతోందని గోల చేస్తున్నారు. 400 ఎకరాల్లో ఐటీ పార్క్ అభివృద్ధి చేద్దామని నిర్ణయించుకుంటే అడ్డుపడుతున్నారు. అభివృద్ధి చేయకూడదు, ప్రజలకు మేలు జరగకూడదు అనే ఆలోచనతో కొందరు ఉన్నారు. దావోస్ వెళ్లి 2.20 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చా.. వారికి ఇక్కడ స్థలాలు ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది. అందుకోసమని 400 ఎకరాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే అడ్డుకుంటున్నారు. ప్రకృతిని మనం కాపాడితే.. అది మనకు రక్షణగా ఉంటుందన్నారు. లేని పక్షంలో కాలుష్యంతో, వరదలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ముంబయి, చెన్నై, ఢిల్లీలో వరద సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రకృతిని కాపాడుకోకపోవడంతో ఈ దేశాన్ని పరిపాలించే ప్రధాని మంత్రి, హోంమంత్రి ఉండే దిల్లీలో సైతం వరదలు వస్తే పార్లమెంటు నుంచి పాఠశాలల వరకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి వచ్చింది. సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల ఈ దుస్థితి వచ్చింది. ఈ పరిస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదనే ఉద్దేశంతో విమర్శలను పట్టించుకోకుండా హైడ్రాను ఏర్పాటు చేశాం. హైడ్రా అంటే కూల్చివేతలే కాదు.. చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడం అనేది




అందరూ గ్రహించాలి. హైడ్రాలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్, అసెట్ ప్రొటెక్షన్ ఉంది. వరదలు సంభవించినప్పుడు డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ప్రజలకు అండగా నిలబడుతోంది. ధనికులు గేటెడ్ కమ్యూనిటీ పేరుతో పేదవారు తమ కాలనీల వైపు రాకుండా అడ్డుగా గోడలు కడుతున్నారు. వీటన్నిటిని పరిష్కరించడానికి హైడ్రాను ఏర్పాటు చేశాం. నగరంలో 940 చెరువలు ఉండగా..వాటిలో 491 చెరువుల కబ్జాకు గురయ్యాయి.

హైడ్రా కార్యకలాపాలను వివరించిన కమిషనర్..

హైడ్రా ఏర్పాటు చేసిన నుంచి నేటి వరకూ చేసిన కార్యక్రమాలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్న ప్రజలకు అండగా ఉంటూ.. వారి సమస్యలు పరిష్కరిస్తున్నాం. దళితవాడకు దారి చూపినా.. కాలనీల మధ్య అడ్డుగోడలు తొలగించినా.. సామాన్యుల పక్షమే అని అనేక సంఘటలను రుజువు చేస్తున్నాయన్నారు. ఫిర్యాదులను అన్ని కోణాల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తున్నాం. నాలాల అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని వివరించారు. ఇప్పుడు పోలీసు స్టేషన్ ప్రారంభంతో కబ్జాల వెనుక ఉన్న సూత్రదారులను కనిపెడతామన్నారు. హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆడియో విజువల్ ద్వారా హైడ్రా కార్యకలాపాలను కళ్లకు కట్టారు.

# ఐపీఎల్ కొనసాగుతుంది.. లీగ్ చైర్మన్ అరుణ్ ధుమాల్ స్పష్టీకరణ

ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ అర్ధాంతరంగా ముగిసిన నేపథ్యంలో ఐపీఎల్‌పై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న క్రమంలో లీగ్ కొనసాగుతుందా లేదా అన్న దానిపై అస్పష్టత నెలకొన్నది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ప్రారంభించిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాక్‌పై మన త్రివిధ దళాలు ముప్పేట దాడికి పాల్పడుతున్నాయి. బుధవారం భారత్ సరిహద్దును ఆనుకుని ఉన్న ఉగ్ర స్థావరాలపై మన సైన్యం ఊహించని రీతిలో విరుచుకుపడింది. దీనిపై లీగ్ చైర్మన్ అనిల్ ధుమాల్ స్పందిస్తూ 'పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతున్నది. ఇప్పటికైతే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అన్నింటిని దృష్టిలో పెట్టుకుని లీగ్ నిర్వహణపై నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. మరోవైపు లీగ్ రద్దు వార్తలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తోసిపుచ్చారు. 'ఇదంతా ఫేక్‌న్యూస్. ఇప్పటికైతే ధర్మశాల మ్యాచ్ ఒకటే రద్దయ్యింది. దేశంలో మాకు వేర్వేరు వేదికలు ఉన్నాయి. బీసీసీఐ ఎమర్జెన్సీ భేటీ ఏమి లేదు. ఇలాంటి తప్పడు వార్తలను వ్యాప్తి చేయవద్దు' అని మీడియా ప్రకటనలో కోరారు.



## RAPO22 టైటిల్ గ్లింప్స్‌కు డేట్ ఫిక్స్




యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు పి.మహేష్ బాబు డైరెక్ట్ చేస్తుండగా RAPO22 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీ రూపొందుతోంది. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటివరకు రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఆసక్తికరంగా ఉండటంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమా నుంచి ఇప్పడు మేకర్స్ ఓ సాలిడ్ ట్రీట్ అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ మూవీకి సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ను మే 15న రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. దీంతో ఈ సినిమాకు ఎలాంటి ఇంట్రెస్టింగ్ టైటిల్ పెడతారా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో రామ్ సరికొత్త లుక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్‌గా నటిస్తుం డటంతో ఈ సినిమాలో వారిద్దరి కెమిస్ట్రీ ఏ విధంగా ఉంటుందా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రానికి మెర్విన్-వివేక్ ద్వయం సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## 'అత్తరు సాయిబు'గా మంచు మనోజ్..

మంచు మోహన్ బాబు తనయుడు మంచు మనోజ్ ఈ మధ్య సినిమాల కన్నా వివాదాలతోనే ఎక్కువగా వార్తలలో నిలుస్తున్నాడు. మనోజ్ సోలో హీరోగా రూపొందిన సినిమా థియేటర్స్‌లోకి వచ్చి చాలా రోజులే అవుతుంది. తను నటించిన 'భైరవం' చిత్రం త్వరలో విడుదల కానుంది. 'మిరాయ్'లో విలన్‌గా కనిపించబోతున్నారు. ఇవి కాకుండా హీరోగా ఓ రెండు సినిమాలు చేస్తున్నట్టు ప్రకటించాడు. కాని అవి మధ్యలోనే ఆగిపోయాయి. అయితే ఇప్పుడు మరో కొత్త సినిమా శ్రీకారం చుట్టడానికి రెడీ అయ్యారు మంచు మనోజ్. 90 ఎం.ఎల్ ఫేమ్ శేఖర్ రెడ్డి దర్శకత్వంలో 'అత్తరు సాయిబు' అనే టైటిల్ తో మనోజ్ సినిమా చేయబోతున్నట్టు తెలుస్తుంది. '90 ఎంఎల్' సినిమా తర్వాత శేఖర్ రెడ్డి ఈ కథ మీద వర్క్ చేయగా,ఈ మూవీని మంచు మనోజ్ పుట్టిన రోజు సందర్భంగా మే 20వ తేదీన పూజా కార్యక్రమాలతో లాంఛనంగా సినిమా ప్రారంభించే అవకాశం ఉంది. ఒకవేళ పూజ కార్యక్రమాలు జరగకపోతే ఆరోజు సినిమాను అనౌన్స్ చేసే ఛాన్స్ ఉంది. టైటిల్ వినగానే ఇది ఏ తరహా సినిమానో మనకు అర్థం అవుతుంది. ఈ చిత్రం. ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ తో సాగే కథ అని అర్థమవుతుంది. నిర్మాత, ఇతర నటీనటుల వివరాలు త్వరలో బయటకు వస్తాయి. కాగా, మంచు మనోజ్ 'వాట్ ద ఫిష్', 'అహం బ్రహ్మస్మి' సినిమాలు ఇది వరకే మొదలెట్టాడు. అయితే ఇవి ఎంత వరకూ వచ్చాయో క్లారిటీ లేదు. ఇక భైరవం చిత్రంతో త్వరలో పలకరించనుండగా, ఇందులో మనోజ్‌తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్ కూడా నటించారు. మినీ మల్టీస్టారర్ సినిమా గా ఈ చిత్రం రూపొందింది. 'కన్నప్ప'కు పోటీగా ఈ సినిమాను విడుదల చేయాలన్నది మనోజ్ ప్లాన్. ఇది వరకు 'కన్నప్ప' రిలీజ్ డేట్ ప్రకటించిన వెంటనే అదే రోజున భైరవం' విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. 'కన్నప్ప' వాయిదా పడడంతో 'భైరవం' చిత్రాన్ని వాయిదా వేశారు. ఇక ఇదిలా ఉంటే మంచు కుటుంబంలో కలహాలు కొన్ని రోజుల క్రితం ఎంత హాట్ టాపిక్ అయ్యాయో మనం చూశాం.. ఇవి ఓ కొలిక్కి వచ్చాయో లేదా అనే దానిపై క్లారిటీ లేదు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## అమెరికాకు చెందిన కార్డినల్ రాబర్ట్ ప్రివోస్ట్ నూతన పోప్‌గా ఎన్నిక

ప్రపంచ క్యాథలిక్ క్రైస్తవుల మత గురువుగా, నూతన పోప్ గా అమెరికాకు చెందిన కార్డినల్ రాబర్ట్ ఫ్రాన్సిస్ ప్రీవోస్ట్ ఎన్నికయ్యారు. ఆయన లియో-14 పేరుతో బాధ్యతలు స్వీకరించనున్నారు. సిస్టీన్ చాపెల్ పైనుంచి తెల్లటి పొగ వెలువడటంతో, కాన్‌క్లేవ్ రెండో రోజే నూతన పోప్ ఎన్నిక పూర్తయినట్లు సంకేతాలు వెలువడ్డాయి. 69 ఏళ్ల ప్రీవోస్ట్, చరిత్రలో పోప్‌గా ఎన్నికైన తొలి అమెరికన్ కావడం విశేషం.చికాగో, ఇల్లినాయిస్‌కు చెందిన ప్రీవోస్ట్, ప్రపంచవ్యాప్త అనుభవమున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన తన వృత్తి జీవితంలో ఎక్కువ భాగం దక్షిణ అమెరికాలో మిషనరీగా గడిపారు. పెరూలో బిషప్‌గా కూడా సేవలందించారు. ఇటీవలి కాలం వరకు వాటికన్‌లో బిషప్‌ల నియామకాలకు సంబంధించిన కీలక కార్యాలయానికి ఆయన నాయకత్వం వహించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న 140 కోట్ల మంది క్యాథలిక్‌లకు ఆయన ఆధ్యాత్మిక మార్గదర్శిగా వ్యవహరించనున్నారు. పోప్ ఫ్రాన్సిస్ చేపట్టిన సంస్కరణలను లియో-14 కొనసాగిస్తారని భావిస్తున్నారు.దాదాపు దశాబ్దకాలం పాటు పెరూలోని ట్రుజిల్లోలో పనిచేసిన ప్రీవోస్ట్, ఆ తర్వాత 2014 నుంచి 2023 వరకు పెరూలోని మరో నగరమైన చక్లాయోకు బిషప్‌గా వ్యవహరించారు. ఆయనకు 2015 నుంచి పెరూ పౌరసత్వం కూడా ఉంది. "నేను ఇప్పటికీ నన్ను ఒక మిషనరీగానే భావిస్తాను.




# చంద్రబాబుకు భద్రతకు పటిష్ఠ చర్యలు

### చేపట్టాలని డీజీపీ ఆదేశం

ఆపరేషన్ సిందూర్' అనంతరం తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఏపీ పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో పాటు ముఖ్యంగా అతి ముఖ్యమైన వ్యక్తుల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణ, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన భద్రతాపరమైన వ్యూహాలపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ విభాగపు అధిపతి మహేశ్ చంద్ర ఇతర సీనియర్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ అధికారులను డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టంగా ఆదేశించారు.భద్రతా నియమావళిని పూర్తిస్థాయిలో, కచ్చితంగా అమలు చేయాలని, ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని ఆయన అధికారులకు గట్టిగా సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనల సందర్భంగా, ముఖ్యంగా జనసమూహంలోకి వెళ్తున్నప్పుడు అనుసరించాల్సిన నిర్దిష్ట నిబంధనలు, ప్రత్యేకంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై నిరంతర నిఘా ఉంచాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎస్పీలకు డీజీపీ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.అనంతరం, రాష్ట్రంలో తీసుకుంటున్న భద్రతా చర్యలు, ముఖ్యమంత్రి భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, భద్రతా చర్యలు అవసరమే అయినప్పటికీ, సామాన్య ప్రజానీకానికి, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైనంత మేరకే భద్రతా ఏర్పాట్లు ఉండాలని, అవి ప్రజలకు ఆటంకంగా మారకూడదని ఆయన స్పష్టం చేశారు.

# నాని సినిమాలో కయాదు లోహర్?



న్యాచురల్ స్టార్ నాని లేటెస్ట్ మూవీ 'హిట్ 3' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి ప్రేక్షకుల నుంచి సాలిడ్ రెస్పాన్స్ దక్కింది. ఇక ఈ సినిమా సక్సెస్ తర్వాత నాని తన నెక్స్ట్ చిత్రాలపై ఫోకస్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో 'ది ప్యారడైజ్' చిత్రాన్ని ఇప్పటికే ప్రారంభించాడు నాని. త్వరలోనే ఈ మూవీ షూటింగ్‌లో కూడా ఆయన జాయిన్ అవుతాడు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ కయాదు లోహర్ సెలెక్ట్ అయినట్టు వార్తలు వస్తున్నాయి. తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' మూవీలో నటించిన ఈ బ్యూటీ తన నటనతో ఆడియన్స్‌కు దగ్గరయ్యింది. దీంతో ఆమెను 'ది ప్యారడైజ్' మూవీ కోసం దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఎంపిక చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ సినిమాలో మరో స్టార్ బ్యూటీ కూడా నటించబోతున్నట్లు తెలుస్తోంది. మరి ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనే విషయంపై మేకర్స్ అఫీషియల్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# పాక్-భారత్ ఉద్రిక్తతలు.. సీఏ పరీక్షలు వాయిదా





దేశవ్యాప్తంగా సీఏ పరీక్షలు వాయిదా పడ్డాయి. భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో సీఏ మే 2025 పరీక్షలను వాయిదావేస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. మే 9 నుంచి 14 వరకు జరగాల్సిన సీఏ ఇంటర్మీడియట్, ఫైనల్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలను వాయిదా వేస్తున్నామని, పరీక్షల షెడ్యూల్‌ను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి సమాచారం కోసం పరీక్షకు నమోదుచేసుకున్న అభ్యర్థులు ఐసీఏఐ వెబ్‌సైట్ icai.org. చూడవచ్చని తెలిపింది. కాగా, షెడ్యూల్ ప్రకారం సీఏ పరీక్షలు మే 2 నుంచి 14 వరకు జరగాల్సి ఉంది. గ్రూప్ 1 అభ్యర్థులకు సీఏ ఇంటర్ పరీక్ష మే 3, 5, 7 తేదీల్లో, గ్రూప్ 2 పరీక్షలు మే 9, 11, 14 తేదీల్లో జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా గ్రూప్ 1 ఫైనల్ ఎగ్జామ్ 2, 4, 6 తేదీల్లో నిర్వహించగా, గ్రూప్ 2 పరీక్ష మే 8, 10, 13 తేదీల్లో జరగాల్సి ఉంది. అనంతరం జరుగనున్న పరీక్షలు ప్రస్తుతం వాయిదా పడ్డాయి. ఇంటర్‌కు సంబంధించిన పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఫైనల్ ఎగ్జామ్ పేపర్లు 1 నుంచి పేపర్ 5 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం5 గంటల వరకు, పేపర్ 6 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు.

# శుభం రివ్యూ




హీరోయిన్ సమంత నిర్మాతగా అలాగే ఆమె క్యామియోలో కూడా నటించిన లేటెస్ట్ చిత్రమే "శుభం". క్లీన్ హిట్ సినిమా బండి దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల తెరకెక్కించిన ఈ చిత్రం మంచి బజ్ ని ముందే సొంతం చేసుకుంది. మరి ఈ చిత్రం ఎలా ఉందో సమీక్షలో చూద్దాం రండి. 2000 దశకంలో నడిచే కథ ఇది కాగా విశాఖపట్నం, భీమిలి ప్రాంతంలో మన టౌన్ కేబుల్ టీవీ నడిపిస్తూ శ్రీనివాస్ (హర్షిత్ ఆర్) అమ్మ నాన్నలు చూసిన పెళ్లి సంబంధానికి వెళ్తాడు. అలా శ్రీవల్లి (శ్రియా కొంతం) ని ఇష్టపడి పెళ్లి చేసుకుంటాడు. ఇలా అయ్యాక తన మొదటిరాత్రి రోజు సరిగ్గా 9 అయ్యేసరికి ఓ సీరియల్ చూస్తూ శ్రీనివాస్ కి దయ్యం పట్టినట్టుగా షాకిస్తుంది. ఇక్కడ నుంచి మొదలైన ఈ తతంగం ఎలా సాగింది? ఈ సమస్య తనకే కాదు తన ఫ్రెండ్స్ (శ్రీనివాస్ గవిరెడ్డి, చరణ్ పెరి) భార్యలు ఫరీదా (షాలిని కొండెపూడి), గాయత్రి (శ్రావణి లక్ష్మి) లకి కూడా జరుగుతుంది అని తెలుసుకుంటారు. మరి వారికి సరిగ్గా సీరియల్ సమయంలోనే ఎందుకు దయ్యం పడుతుంది? ఇంతకీ ఆ సీరియల్ ఏంటి? ఆ సీరియల్ ని ఎలా ఎండ్ చేశారు? ఈ క్రమంలో మంత్రగత్తె మాయ శ్రీ (సమంత) చూపించిన పరిష్కారం ఏంటి? చివరికి దయ్యాలు వదిలాయా లేదా ఆ దయ్యాలు ఎవరు అనేవి తెలియాలి అంటే ఈ చిత్రాన్ని చూడాల్సిందే. మెయిన్ గా ఈ సినిమాలో పాయింట్ ఒకింత చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది అని చెప్పొచ్చు. సీరియల్స్ తో కూడా హారర్ బ్యాక్ డ్రాప్ లో అది కూడా మంచి హిలేరియస్ గా చూపించడం అనేది సాధ్యమవుతుంది అనేది దర్శకుడు చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ఒక రెగ్యులర్ స్టార్ట్ తర్వాత సినిమా పికప్ అయ్యిన విధానం అలాగే ఒక క్లీన్ కామెడీతో సాగే కథనం ఆడియెన్స్ ని ముఖ్యంగా మహిళలని లీనం అయ్యేలా చేస్తాయి. అంతే కాకుండా అక్కడక్కడా కొన్ని కామెడీ సీన్స్ అయితే మరింత హిలేరియస్ గా సినిమాలో పేలతాయి. వీటితో ఈ చిత్రం సాలిడ్ ఎంటర్టైన్మెంట్ ని అన్ని వర్గాల ఆడియెన్స్ కి అందిస్తుంది. అలాగే కేవలం ఈ ఫన్ మూమెంట్స్ మాత్రమే కాకుండా ఆకట్టుకునే బ్యూటిఫుల్ ఎమోషన్స్ ఇంకా భార్య భర్తలపై కొన్ని మీనింగ్ ఫుల్ సన్నివేశాలు చాలా బాగున్నాయి. అలాగే అక్కడక్కడా హారర్ సీన్స్ కూడా డీసెంట్ ట్రీట్ ని అందిస్తాయి. ఇక నటీనటుల్లో మొత్తం అంతా కూడా బాగా చేసారని చెప్పాలి. హర్షిత్ ఆర్ చాలా నాచురల్ గా మంచి నటన కనబరిచాడు. హారర్ సీన్స్ లో తన భార్యతో సన్నివేశాల్లో అలాగే కన్ఫ్యూజ్ సన్నివేశాల్లో తన టైమింగ్ బాగుంది. అలాగే తన సరసన నటించిన శ్రియా కొంతం బ్యూటిఫుల్ గా కనిపిస్తూ తాను కూడా మంచి సహజమైన నటనను అందించింది. ఇక వీరితో పాటుగా వారికి ఫ్రెండ్స్ గా నటించిన చరణ్ పెరి, శ్రీనివాస్ రెడ్డిలు ఆల్ఫా మేల్స్ గా బాగా చేశారు. వారిపై పలు కామెడీ సీన్స్ హిలేరియస్ గా వర్క్ అయ్యాయి. ఇంకా వారి భార్యలుగా చేసిన శ్రావణి లక్ష్మి, షాలిని కొండెపూడి కూడా బాగా చేశారు. ఇక వీరితో పాటుగా నటుడు వంశీధర్ గౌడ్ కూడా తన రోల్ లో భలే చేశారు. కొన్ని కామెడీ సీన్స్ అయితే మామూలు హిలేరియస్ గా ఉండవు. ఇక ఫైనల్ గా స్పెషల్ రోల్ లో కనిపించిన రాగ్ మయూర్ అండ్ సినిమా బండి టీం ఎంట్రీ నుంచి కథనం మరింత ఎంటర్టైనింగ్ గా సాగుతుంది. ఇక సమంత కూడా చిన్న క్యామియోలో తన రోల్ కి న్యాయం చేకూర్చారు. ఈ చిత్రంలో లైన్ బాగానే ఉంది కానీ చాలా మందికి ఇది ఒకింత సిల్లీగా కూడా అనిపించవచ్చు. నిజ జీవితంలో ఇలాంటివి వర్కౌట్ అవుతాయా? అనే ప్రశ్న ఒక సమయంలో ఆడియెన్స్ లో రాక మానదు. అలాగే సినిమా స్టార్టింగ్ లో కథనం కొంచెం స్లోగానే మొదలవుతుంది. సో మెయిన్ అంశంలోకి వెళ్ళడానికి కొంచెం సమయం పడుతుంది. ఇక వీటితో పాటుగా సెకండాఫ్ లో హారర్ ఎలిమెంట్స్ ఒకింత ఓవర్ గా అనిపిస్తాయి. ముగ్గురు ఫీమేల్ లీడ్స్ పై చూపించే ఆ కొన్ని సన్నివేశాలు రిపీటెడ్ గా ఓవర్ డ్రమాటిక్ గా తీసినట్టు అనిపిస్తుంది. అలాగే సెకండాఫ్ లో కథనం అక్కడక్కడా కొంచెం సాగదీసినట్టు అనిపిస్తుంది. ఇంకా సమంత రోల్ ని ఇంకొంచెం బాగా డిజైన్ చేయాల్సింది. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు బాగున్నాయని చెప్పాలి. నేపథ్యానికి తగ్గట్టుగా చేసుకున్న సెటప్ అంతా బాగుంది. మెయిన్ గా వింటేజ్ బ్యాక్ డ్రాప్ ని చక్కగా ఆవిష్కరించారు. ఒక రెండు దశాబ్దాల కితం ఉన్న పరిస్థితులు వాటిని దర్శకుడు బాగా చూపించాడు. వివేక్ సాగర్ బ్యాక్గ్రౌంగ్ స్కోర్ సినిమాలో బాగుంది. షోర్ పోలీస్ పాటలు బాగున్నాయి. మ్రిదుల్ సుజిత్ సేన్ సినిమాటోగ్రఫీ బాగుంది. అలాగే ధర్మేంద్ర కాకర్ల ఎడిటింగ్ కూడా బాగుంది. ఇక దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల విషయానికి వస్తే.. ఈ సినిమాకి తన వర్క్ మెప్పిస్తుంది. తన సినిమాకి ఒక సెపరేట్ వరల్డ్ ని తాను క్రియేట్ చేసుకున్నారు. అలా మంచి హారర్ కం ఫన్ ఎలిమెంట్స్ వీటికి మించిన బ్యూటిఫుల్ ఫ్యామిలీ ఎలిమెంట్స్ ని హ్యాండిల్ చేసిన విధానం బాగుంది.

# 'ఆపరేషన్ సిందూర్' టైటిల్ కోసం..




'ఆపరేషన్ సిందూర్' టైటిల్ హక్కుల కోసం బాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థలు పోటీపడుతున్నాయి. ఒకట్రెండు కాదు ఏకంగా 15 ప్రొడక్షన్ హౌస్‌లు ఈ టైటిల్ కోసం ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో దరఖాస్తు చేసుకోవడం విశేషం. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' లక్ష్యాన్ని సాధిస్తున్నది. పాక్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ దళాలు క్షిపణులతో ధ్వంసం చేస్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' టైటిల్ భారతీయ సంస్కృతిని, స్త్రీ సంకల్పాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన టైటిల్ కావడంతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పటికే చాలా మంది నిర్మాతలు ఈ టైటిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు బీఎన్ తివారీ తెలిపారు. మహావీర్ జైన్ ఫిల్మ్స్ ఈ టైటిల్ కోసం తొలి దరఖాస్తుని ఇచ్చిందని తెలిసింది. ప్రముఖ నిర్మాణ సంస్థలు జీ స్టూడియోస్, టీ-సిరీస్‌తో పాటు ప్రముఖ దర్శకుడు మధుర్ భండార్కర్ సైతం టైటిల్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని సమాచారం.



## అజ్ఞాతంలోకి పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్!

'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన మెరుపుదాడులతో పాకిస్థాన్ గజగజా వణుకుతోంది. నిన్న ఇస్లామాబాద్‌లోని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇంటి సమీపంలో భారత్ మిస్సైల్ దాడులకు దిగింది. దాంతో ఆయనను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. కుటుంబంతో సహా ప్రత్యేక విమానంలో విదేశాలకు వెళ్లిపోయినట్లు సమాచారం. మరో వైపు ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునిర్ కూడా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.భారత్ వరుస దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్తాన్ .భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా ప్రతీకార దాడులకు దిగింది. అయితే పాక్ మిస్సైల్స్, డ్రోన్లను భారత సైన్యం ధ్వంసం చేసింది. పాకిస్తాన్ ప్రయోగించిన డ్రోన్లు, రాకెట్లు, యుద్ధ విమానాలను భారత సైన్యం గాల్లోనే కూల్చేసింది. ఈ క్రమంలో గురువారం రాత్రి పాక్ ప్రధాని ఇంటి సమీపంలో భారత్ దాడులు చేసింది. లాహోర్, ఇస్లామాబాద్, సియాల్‌కోట్, కరాచీపై మిస్సైల్‌స్‌తో దాడికి దిగింది.

## అనుమానంతో భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

అనుమానంతో భార్యను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని బొక్కలోనిపల్లికి చెందిన రాజేష్ (35) సరిత (30) దంపతులు కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సరిత ప్రవర్తనలో తేడా ఉందని అనుమానంతో తరచూ గొడవ పడుతున్నాడు. గురువారం ఇద్దరూ పెళ్లికి వెళ్లొచ్చి ఇంట్లో మరొసారి గొడవపడ్డారు. ఈక్రమంలో ఆగ్రహంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో భార్యపై దాడి చేసి చంపాడు.అనంతరం సమీపంలోని రైల్వే ట్రాక్ పై పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సరిత తండ్రి నాగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వీరికి ఎనిమిది, పదేండ్ల వయసు ఉన్న ఇద్దరు కొడుకులు ఉన్నారు.

